## క్లుప్తంగా

### అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో మరకత మణికంఠ

**బోట్‌క్లబ్:** అయ్యప్పస్వామి జన్మనక్షత్రమైన ఉత్తరా నక్షత్రం సందర్భంగా సోమవారం స్థానిక భానుగుడి అయ్యప్పస్వామి ఆలయంలో పంచామృతాభిషేకాలు నిర్వహించారు. స్వామి వారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకొన్నారు. స్థానిక రామారావుపేట సౌమ్య ఎన్‌క్లేవ్‌లో ఉన్న మరకత మణికంఠకు ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. పీఠం అర్చకులు రమేష్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. పీఠం వ్యవస్థాపకుడు నందమూరి వినోద్ ఆధ్వర్యంలో ఈ పూజలు నిర్వహించారు. పీఠం కార్యవర్గ సభ్యులు పుష్పాల ఉదయభాస్కర్, పబ్బిసెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

### టీడీపీ, జనసేన కూటమి ఓటమి ఖాయం

**కరప:** వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమికి ఓటమి ఖాయమని రాష్ట్రీయ హిందూ చైతన్య సదస్సు అధ్యక్షుడు పడాల రఘు అన్నారు. మండలం నడకుదురులో సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. తెలుగుదేశం, జనసేన పార్టీల పొత్తు, అభ్యర్థుల ఎంపిక ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా ఉందన్నారు. ఎస్సీ సామాజిక వర్గానికి రిజర్వ్ చేసిన స్థానంలో క్రైస్తవులను ఎలా పోటీ చేయిస్తారని ఆయన ప్రశ్నించారు. గతంలో బీజేపీ, జనసేన, టీడీపీ పొత్తు ధర్మాన్ని విస్మరించి ఆయా పార్టీల కార్యకర్తలకు అన్యాయం చేసి, పొత్తుకు తూట్లు పొడిచారని ఆయన విమర్శించారు. మూడు పార్టీల పొత్తుతో 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ అహంకారంతో దేశప్రధానిని ఇష్టానుసారంగా దూషించారని, బీజేపీ నాయకులపై దాడులు చేయించారని ఆనాటి సంఘటనలను ఆయను గుర్తుచేశారు. ఇప్పుడు మళ్లీ పొత్తులు పెట్టుకుని పోటీ చేస్తామనడం సిగ్గు చేటన్నారు. రిజర్వుడు స్థానాలలో నిజమైన దళితులకు అవకాశం కల్పించాలని, హిందూ వ్యతిరేకులకు టికెట్లు ఇవ్వకూడదని రాష్ట్రీ హిందూచైతన్య సదస్సు అధ్యక్షుడు రఘు సూచించారు.

### హెప్సిబాకు సేవా ఆరోగ్య మిత్ర పురస్కారం



కలెక్టర్ కృతికా శుక్లా నుంచి పురస్కారాన్ని అందుకుంటున్న గోర్స హెప్సిబా

**కాకినాడ సిటీ:** వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, ఆరోగ్య ఆసరా పథకాల అమలులో నిరంతరం వైద్యం కోసం వచ్చే ఆరోగ్యశ్రీ లబ్ధిదారులకు ఆరోగ్యమిత్రగా అందించిన సేవలకు రాష్ట్రప్రభుత్వం సేవా ఆరోగ్యమిత్ర పురస్కారాన్ని ఆగస్టు నెలకు గోర్స హెప్సిబాకు కలెక్టర్ కృతికా శుక్లా సోమవారం అందించారు. ఈమె మాధవపట్నం సూర్య గ్లోబల్ ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ ఆరోగ్యమిత్రగా ఆమె పని చేస్తున్నారు. కలెక్టరేట్‌లో ఆమెకు ప్రశంసా పత్రం, రూ.5 వేల నగదు పురస్కారం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ పి.రాధాకృష్ణ, ఆరోగ్యశ్రీ మేనేజర్ కె.నవీన్ తదితరులు పాల్గొన్నారు.

### కలెక్టర్‌కు ఉద్యోగుల అభినందనలు

**కాకినాడ సిటీ:** వికాస ద్వారా హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ సంస్థలో ఈనెల 23వ తేదీన నిర్వహించిన జాబ్ డ్రైవ్‌లో 20 మంది అభ్యర్థులు వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరు సోమవారం స్పందన హాలులో కలెక్టర్ కృతికా శుక్లాను మర్యాదపూర్వకంగా కలుసుకుని పుష్ప గుచ్ఛాలు అందజేశారు. ఆ సంస్థలో సీనియర్ సేల్స్ ఆఫీసర్‌గా రూ.18 వేలు జీతం, ఇన్సెంటివ్స్‌తో, సేల్స్ మేనేజర్‌గా రూ.13 వేలు వేతనం, ఇన్సెంటివ్‌లతో వీరు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో వికాస పీడీ కె.లచ్చారావు, హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ సంస్థ బ్రాంచ్ మేనేజర్ రత్నరాజు తదితరులు పాల్గొన్నారు.

### మహిళా సంక్షేమానికి ప్రధాని మోదీ కృషి

**బోట్‌క్లబ్:** మహిళా సంక్షేమం కోసం ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని బీజేపీ నగర కన్వీనర్ గట్టి సత్యనారాయణ అన్నారు. స్థానిక సూర్యనారాయణ పురంలో 150 మందికి ఉజ్వల గ్యాస్ సిలిండర్లు సోమవారం పంపిణీ చేశారు. పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

### మార్చి ఒకటిన చలో కలెక్టరేట్

**కరప:** భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పథకాలను పునరుద్ధరించాలని, ఇతర సమస్యల పరిష్కారం కోసం మార్చినెల ఒకటో తేదీన ఛలో కలెక్టరేట్ చేపట్టినట్టు ఆ సంఘం జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు చెక్కల రాజ్‌కుమార్ కోరారు. స్థానిక భవన నిర్మాణ కార్మికుల సంఘ భవనంలో సోమవారం కార్మికుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చలో కలెక్టరేట్ పోస్టర్లను ఆవిష్కరించారు.

# ఇంటిని చూసి.. ఇంతింతీ మురిసి..



కొమరగిరిలో నిర్మాణాలను చూసేందుకు వచ్చిన లబ్ధిదారులు



నిర్మాణాల వద్ద లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి

- కొమరగిరిలో లబ్ధిదారుల సందడి
- గృహ నిర్మాణ ప్రగతిని చూపిన ద్వారంపూడి

**కాకినాడ:** నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో సిటీ నియోజకవర్గ లబ్ధిదారులకు కొమరగిరి లేఅవుట్‌లో కేటాయించిన స్థలాలు, అక్కడ జరుగుతున్న ఇళ్ల నిర్మాణ ప్రగతిని చూసి లబ్ధిదారులు సంబరపడ్డారు. తమ స్థలాల్లో కూడా ఇదే తరహాలో ఇళ్ల నిర్మాణం జరగబోతోందన్న సమాచారం వీరికి సంతోషాన్నిచ్చింది. నిర్మాణంలో ఉన్న ఇళ్లను చూసి మురిసిపోయారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి జగన్నాథపురం ప్రాంతంలోని 19, 20, 21 డివిజన్లకు చెందిన లబ్ధిదారులను సోమవారం ప్రత్యేక బస్సుల్లో కొమరగిరి తరలించి అక్కడి నిర్మాణ ప్రగతిని స్వయంగా చూపించారు. దాదాపు 17 వేల మంది లబ్ధిదారులకు కొరమరగిరిలో స్థలాలు కేటాయించగా సుమారు 10 వేల ఇళ్లు పునాదుల నుంచి పూర్తయ్యే వరకు వివిధ దశల్లో ఉన్నాయి. వీటన్నింటినీ త్వరలోనే పూర్తిచేసి లబ్ధిదారులకు అప్పగించనున్నట్టు ఎమ్మెల్యే ద్వారంపూడి వివరించారు. భవిష్యత్‌లో ఈ ప్రాంతం మరో టౌన్‌షిప్‌గా అవతరించబోతున్న విషయాన్ని ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన స్లైడ్స్ ద్వారా కాకినాడ వాసుల సొంతింటికల సాకారం చేసేందుకు ఇప్పటి వరకు జరిగిన ప్రగతిని తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాకినాడలో 10 వేల మందికి ఇళ్ల స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చినప్పటికీ సీఎం జగన్ ఇచ్చిన ప్రోత్సాహంతో 30 వేల మందికి పట్టాలు ఇచ్చామన్నారు. కొమరగిరిలో ఇళ్ల నిర్మాణం ప్రారంభమైందని, చొల్లంగిలో కేటాయించిన లబ్ధిదారులకు కూడా మరింత వేగంగా ఇళ్లు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. రానున్న ఎన్నికల్లో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 2025 డిసెంబర్ నాటికల్లా స్థలాలు ఇచ్చిన 30 వేల వేలమందికి ఇళ్ళు నిర్మించి ఇచ్చే బాధ్యతను తీసుకుంటానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, వైఎస్సార్ సీపీ నగరధ్యక్షురాలు, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ డేగల వెంకటరాజు, పెద్ద సంఖ్యలో మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. స్థలాల పరిశీలనకు వచ్చిన సుమారు 2 వేల మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే ద్వారంపూడి భోజనాలు ఏర్పాటు చేశారు.

# ‘తడబాటు’పై రాద్ధాంతమా?

### వనమాడిపై ఎమ్మెల్సీ పద్మశ్రీ మండిపాటు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ

**కాకినాడ:** ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ‘తడబాటు’తో చేసిన వ్యాఖ్యలను రాజకీయ లబ్ధి కోసం చిలువలు పలువలు చేసి రాద్ధాంతం చేసేందుకు ప్రయత్నించడం సరికాదని శాసన మండలి సభ్యురాలు కర్రి పద్మశ్రీ పేర్కొన్నారు. ఎమ్మెల్యే ద్వారంపూడి మత్స్యకార జాతిని అవమానించేలా వ్యాఖ్యలు చేశారని, ఆయన క్షమాపణ చెప్పాలంటూ టీడీపీ మాజీ శాసనసభ్యుడు వనమాడి కొండబాబు చేసిన డిమాండ్‌పై ఆమె సోమవారం సాయంత్రం విలేకర్ల సమావేశంలో అసహనం వ్యక్తం చేశారు. అర్థంలేని నిందారోపణలతో వనమాడి చేస్తున్న విమర్శలకు బదులిచ్చే క్రమంలో ఎమ్మెల్యే ద్వారంపూడి వనమాడి కుటుంబాన్ని విమర్శించారని, ఆ క్రమంలో తడబాటుతో దొర్లిన ఒక పదాన్ని సామాజిక మాధ్యమాల్లో ఎడిటింగ్ చేసి మత్స్యకార జాతిని అవమానించారంటూ దుష్ప్రచారం చేస్తున్నారంటూ ధ్వజమెత్తారు. ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి మత్స్యకార సామాజికవర్గానికి పెద్దపీట వేసి అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించాలని కోరుకున్నారని, ఆ మేరకు అత్యున్నత పదవుల నుంచి మరెన్నో పథకాల ద్వారా మత్స్యకారుల ప్రగతికి తోడ్పడ్డారన్నారు. ప్రధానంగా మత్స్యకార జాతిని ఉద్దేశించి మాట్లాడే అవసరం కూడా అక్కడ ఎదురుపడలేదని, అలాంటప్పుడు అవమానించే పరిస్థితి ఎలా ఉత్పన్నమవుతుందని ప్రశ్నించారు. కాకినాడకు సంబంధంలేని కొంతమంది వ్యక్తులు తమ ఉనికిని చాటుకునేందుకు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారంటూ ఆమె మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ నగర ఉపాధ్యక్షుడు చక్రవర్తి మాట్లాడుతూ సాటి మత్స్యకార వర్గాలను కొండబాబు పూర్తిగా నిర్లక్ష్యం చేయడం వల్లే తమకు గౌరవాన్నిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి వద్దకు చేరారన్నారు. దూరమైన మత్స్యకారులకు తిరిగి దగ్గరయ్యేందుకు ఈ అంశాన్ని సాకుగా చేసుకుని కొండబాబు, కొంతమంది వ్యక్తులు పథకం ప్రకారం దుష్ప్రచారం చేస్తున్నారంటూ మండిపడ్డారు. మాజీ కార్పొరేటర్ సంగాని నందం మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తుండడంతో కులాల మధ్య చిచ్చు రాజేసేందుకు మత్స్యకారజాతిని అడ్డుగా పెట్టుకుని రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. ఎవరెన్ని విమర్శలు చేసినా కాకినాడలోని మత్స్యకారులు ఎమ్మెల్యే ద్వారంపూడి నాయకత్వాన్ని సంపూర్ణంగా ఆదరిస్తున్నారన్నారు. సమావేశంలో హెచ్ఎంఎస్ అధ్యక్షుడు అంకాడి సత్తిబాబు, నాయకులు లంకే గోపి, భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి చిహ్నాలివి



నేమాంలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు తదితరులు

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- సచివాలయ భవనాల ప్రారంభం

**కాకినాడ రూరల్:** అభివృద్ధికి చిహ్నాలుగా గ్రామ సచివాలయ భవనాలు నిలుస్తున్నాయని, ప్రజలకు సకాలంలో సేవలందించే ఆధునిక దేవాలయాలుగా ఇవి మారాయని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. మండలంలోని నేమాంలో వైఎస్ జగన్‌మోహన్‌పురం గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవన సముదాయాలను సోమవారం ఆయన ప్రారంభించారు. రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం, రూ.22 లక్షలతో నిర్మించిన ఆర్బీకే, రూ.16 లక్షలతో నిర్మించిన జగనన్న పాల వెల్లువ భవనం, రూ.17.5 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ విలేజ్ క్లినిక్ భవనాలను సర్పంచ్ రామదేవు సూర్యప్రకాశరావు ఆధ్వర్యంలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నబాబు మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయాలు ప్రజలకు సేవలు అందించడంలో ఆదర్శవంతంగా నిలిచాయన్నారు. ప్రతి సచివాలయంలో సుమారు 10 మంది సిబ్బంది వివిధ శాఖలకు సంబంధించి సేవలందిస్తున్నారన్నారు. కాకినాడను ఆనుకుని సముద్రతీరం పక్కనే ఉన్న నేమాం గ్రామంలో భవిషత్తులో నగరాన్ని తలపింపజేస్తుందన్నారు. రూరల్ నియోజకవర్గంలోని ఎక్కువ మంది పేదలకు జగనన్న కాలనీలను నేమాంలో అభివృద్ధి చేసి విలువైన స్థలాలు అందించామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమంతో పాటు అభివృద్ధికి పెద్ద పీట వేశారన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వంలో ప్రజలు విన్నపాల మేరకు గుర్తించి సమస్యలు పరిష్కరించి రోడ్లు, డ్రైనేజీలు, వంటి మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. నేమాంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. సర్పంచ్ సూర్యప్రకాశరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే కన్నబాబు జగనన్న లేఅవుట్ల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇచ్చారని తద్వారా వేలాది మంది ఇక్కడ నివాసాలు ఏర్పాటు చేసుకుంటున్నారన్నారు. గృహ నిర్మాణాలు చేసుకుంటున్నవారికి కావల్సిన సదుపాయాలు కల్పిస్తూ అండగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ గగారిన్ తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ ప్రమాదాలను నివారించాలి





వర్క్‌షాపులో మాట్లాడుతున్న జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు

**బాలాజీచెరువు (కాకినాడ సిటీ):** నేటి కాలంలో సైబర్ ప్రమాదాలు ఎక్కువవుతున్నాయని, వాటి నివారణకు పరిష్కారం కనుగొనాలని జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు పేర్కొన్నారు. జేఎన్‌టీయూకే సీఎస్ఈ, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మైక్రో స్మాల్ మీడియం ఎంటర్‌ప్రైజస్ సంయుక్తంగా సైబర్ సెక్యూరిటీపై అడ్వాన్స్‌డ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ స్కిల్ డవలప్‌మెంట్ పోగ్రాం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ ప్రసాదరాజు మాట్లాడుతూ ఐదు రోజుల పాటు నిర్వహించే సైబర్ సెక్యూరిటీ వర్క్‌షాప్‌లో నిపుణుల ద్వారా అందించబడే సెషన్లను ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలన్నారు. స్వయం ఉపాధి, స్టార్టప్ పోగ్రాం, కన్సల్టెన్సీ సేవలు అందించేందుకు వర్క్‌షాపు దోహదపడుతుందన్నారు. పరిశోధక విద్యార్థులు, పీజీ విద్యార్థులు ఆధునిక సాంకేతికతలపై పట్టు సాధించి వినూత్న ఆవిష్కరణలు చేపట్టేందుకు ఆసక్తి కనబరచాలన్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ సుమలత, సీఎస్ఈ ప్రొఫెసర్ చక్రవర్తి, ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

### ఆక్రమణలకు వనమాడి వత్తాసు

#### అక్రమంగా తొలగిస్తున్నారంటూ హైడ్రామా

**కాకినాడ:** కాకినాడ పూలే పాకల వద్ద ఆక్రమణదారులను ప్రోత్సహిస్తూ టీడీపీ మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు వత్తాసుపలకడం విమర్శలకు తావిస్తోంది. వాస్తవానికి అక్కడ 15 ఏళ్లుగా స్థిరనివాసం ఏర్పరచుకున్న స్థానికులకు పట్టాలు ఇచ్చేందుకు రెవెన్యూ, గృహనిర్మాణ, సచివాలయ సిబ్బంది సర్వే చేసి మరీ పారదర్శకంగా ప్రక్రియ పూర్తి చేశారు. విషయం తెలుసుకున్న కొంత మంది ఆక్రమణదారులు అక్కడ తాజాగా పాకలు వేసుకోవడంతో వివాదం రేగింది. సమాచారం తెలుసుకున్న అధికారులు ఆక్రమణదారులు వేసిన పూరిళ్లను తొలగించిన నేపథ్యంలో కొండబాబు అక్కడికి వెళ్లి ఆక్రమణదారుల తరఫున హడావుడి చేశారు. అన్యాయంగా పూరిళ్లను తొలగిస్తున్నారంటూ విమర్శించారు. ఆక్రమణలను ప్రోత్సహిస్తూ ఆయన చేసిన నిరసన చూసి స్థానికులు ముక్కున వేలేసుకున్నారు. అక్కడి లబ్ధిదారులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా అక్కడ ఉంటున్న తమకు ఎమ్మెల్యే ద్వారంపూడి న్యాయం చేశారన్నారు. టీడీపీ హయాంలో తమ సమస్యలను ఏ మాత్రం పట్టించుకోకుండా ఇప్పుడు వచ్చి ఆక్రమణదారులకు వత్తాసు పలుకుతున్నారంటూ మండిపడ్డారు.

### రేపటి నుంచి రైల్వే గేటు మూసివేత

**సామర్లకోట:** స్థానిక గాంధీ చౌక్ నుంచి కాకినాడ వెళ్లే ఎల్‌సీ 426 గేటు బుధవారం నుంచి మార్చి ఆరో తేదీ వరకు మూసివేయనున్నట్టు రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజినీరు బి.రామసుబ్బారావు తెలిపారు. రైల్వే గేటు పరిధిలో ట్రాక్ మరమ్మతుల వల్ల రాకపోకలు నిషేధించినట్టు తెలిపారు. చిన్న వాహన చోదకులు, రైతులు ఫ్లైఓవర్ మీదుగా రాక పోకలు సాగించాల్సి ఉంది. ఇప్పటికే ఫ్లైఓవర్‌పై తరుచూ ట్రాఫిక్ స్తంభించి పోతోందని, ఈ రైల్వే గేటు మూసివేత వల్ల ఆ సమస్య మరింత పెరిగే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు. ఈ మేరకు ఫ్లైఓవర్‌పై ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు కాకినాడ రోడ్డులో ఫ్లైఓవర్ బ్రిడ్జి దిగువ భాగంలోను, కాకినాడ–వేట్లపాలెం కూడలిలోను, వైఎస్సార్ విగ్రహం కూడలి వద్ద పోలీసు సిబ్బందిని నియమించాలని స్థానికులు కోరుతున్నారు.

# ప్రజా ఫిర్యాదులకు ప్రత్యేక ప్రాధాన్యం

- కమిషనర్ వెంకటరావు
- 20 సమస్యలపై అర్జీల స్వీకరణ



సమస్యలు వింటున్న కమిషనర్ వెంకటరావు. చిత్రంలో ఏడీసీ నాగనరసింహారావు

**కాకినాడ:** ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా ఫిర్యాదులకు ప్రత్యేక ప్రాధాన్యం నివ్వాలని నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు అధికారులను ఆదేశించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాలు నిర్వహించారు. కమిషనర్ వెంకటరావు, అదనపు కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. డయల్ యువర్ కమిషనర్‌కు 8, స్పందనకు 12 మంది వివిధ సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. టిడ్కో పథకంలో చెల్లించిన సొమ్ములు వెనక్కు ఇవ్వాలని, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ ఇతర విభాగాలకు సంబంధించిన సమస్యలపై ప్రజలు వినతులు అందజేశారు. ఆయా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ అధికారులను కోరారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను ఎప్పటికప్పుడు వేగంగా పరిష్కరించడంతో పాటు, అందుకు సంబంధించిన సమాచారాన్ని దరఖాస్తుదారులకు తెలియజేయాలని కోరారు. ప్రతి ఒక్క సమస్యకు నాణ్యమైన పరిష్కారాన్ని అందిస్తామని స్పష్టం చేశారు. న్యాయపరమైన, ఆర్థిక పరమైన అంశాలు మినహా మిగిలిన సమస్యలకు సత్వర పరిష్కారాన్ని అందిస్తామని చెప్పారు. నగరపాలక సంస్థ కార్యాలయం వరకు రాలేని ప్రజలు స్థానికంగా ఉండే సచివాలయాల్లో కూడా దరఖాస్తులు అందజేయవచ్చునని సూచించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఎస్ఈ పి.సత్య కుమారి, వివిధ విభాగాధిపతులు, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

# నిత్యావసర సరకుల పంపిణీ



బాధితులకు నిత్యావసర సరకులు అందజేస్తున్న రామారెడ్డి

**కాకినాడ:** స్థానిక దుమ్ములపేటలో అగ్నిప్రమాదానికి గురై దగ్ధమైన రెండు పూరిళ్లలోని బాధితులకు స్థానిక వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పడాల రామారెడ్డి సోమవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. బాధితుల సమస్యను ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి దృష్టికి తీసుకువెళ్ళి న్యాయం చేసేందుకు ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట స్థానిక నేతలు మట్టపర్తి రఘురామ్, ఎరిపల్లి సీతారామ్, మోసా జాన్ తదితరులు ఉన్నారు.

# అదిరేటి కవరు నేనేస్తే..

- సెల్‌ఫోన్ కవర్లకు యమా డిమాండ్
- రూ.5 వేల వరకు షాపుల్లో లభ్యం
- ఆడవాళ్లు అధికంగా వినియోగం
- ఆన్‌లైన్‌లో విరివిగా విక్రయాలు



మహిళలు ఇష్టపడే వివిధ రకాల డిజైన్ సెల్‌ఫోన్ కవర్లు

**బోట్‌క్లబ్:** వాహన చోదకులు ప్రాణ రక్షణకు ధరించాల్సిన హెల్మెట్‌నైనా విస్మరిస్తారేమో కానీ మొబైల్ ఫోన్‌కు కవర్ వేయకుండా ఉండలేరు. ఆ మొబైల్ ఏ బ్రాండుదైనా, ఎంత ఖరీదైనదైనా చేతిలో ఇమిడిపోయేలా, ఆకర్షణీయంగా కనపడేలా ఫ్లిప్ కవరో, పౌచో తొడగాల్సిందే. ప్రాణం కన్నా మిన్నగా దానిని చూసుకుంటారు కొనుగోలుదారులు. టెక్నాలజీ మారే కొద్దీ కొన్ని స్లీక్ మోడళ్లు కొన్ని సార్లు చేతి నుంచి జారిపోయి వేల రూపాయలు నష్టపోయే ప్రమాదం ఉంది. ఆ పరిస్థితి రాకుండా వినియోగదారులు వాటికి ఆ దుకాణంలోనే కవర్లను కూడా ఎంచుకుని తొడిగేస్తున్నారు. ప్రస్తుతం ఈ కవర్ల ధరలే నాణ్యతను బట్టి రూ. 100 నుంచి రూ.5 వేల వరకు మార్కెట్‌లోకి అందుబాటులోకి వచ్చాయి. సహజంగా సెల్‌ఫోన్ బాక్సుతోనే కొన్ని సంస్థలు వాటిని అందజేస్తున్నా అవి ట్రాన్స్‌పెరెంట్‌గా ఉంటూ అంతగా ఆకట్టుకోవడం లేదు. దీంతో చాలా మంది యువత మగవారైతే సాధారణంగా ప్లెయిన్ డిజైన్ పౌచ్, లేదా ఫ్లిప్ కవర్లు వినియోగిస్తున్నా మహిళల మొబైల్ ఫోన్లు మాత్రం పువ్వులు, సీతాకోక చిలుకలు, పెంపుడు జంతువుల డిజైన్లతో ఉన్న కవర్లు వినియోగిస్తున్నారు. ఒక సెల్ ఫోన్ సుమారు రెండు మూడేళ్లు వినియోస్తారు. దానికి ఐదారు నెలలకు ఒక కవర్ మారుస్తుంటారు. కాకినాడ నగరంలోను సుమారు 200కు పైగా సెల్ ఫోన్లు, కవర్లు విక్రయించే దుకాణాలు ఉన్నాయి. భానుగుడి, మెయిన్‌రోడ్డు, తిలక్‌స్ట్రీట్, దేవాలయం వీధి వంటి ప్రధాన కూడళ్లలో ఉన్న ఒక్కొక్క దుకాణంలో ప్రతీ రోజు 100కి పైగా సెల్‌ఫోన్ కవర్లు విక్రయిస్తున్నారు. ఈ కవర్ల ద్వారానే ప్రతీ రోజు పెద్ద వయస్సు వారు సెల్‌ఫోన్ రక్షణ కోసం ఎక్కువ మందం ఉన్న కవర్స్ కొనుగోలు చేస్తుంటే నేటి యువత మాత్రం లుక్ అందంగా ఉండే కవర్స్‌పైనే మక్కువ చూపుతున్నారు.

#### డిజైనర్ కవర్ల హవా...

సాధారణ సెల్‌ఫోన్ కవర్లు ఇష్టపడని వారు డిజైనర్ కవర్స్ ఎక్కువగా ఇష్టపడుతున్నారు. వీటి రేటు కూడా అంతే ఎక్కువగా ఉంది. రూ.ఐదు వేలకు పైబడి ఈ కవర్లు మార్కెట్‌లోకి అందుబాటులోకి వచ్చాయి. సెల్‌ఫోన్ కవర్లు కూడా ఆన్‌లైన్‌లో అధికంగా కొనుగోలు చేస్తున్నారు. అమెజాన్, ఫ్లిప్‌కార్టుతో పాటు వివిధ ఆన్‌లైన్ సైట్‌లలో వీటిని కొనుగోలు చేసేవారి సంఖ్య అధికంగా ఉండడం విశేషం. కొత్త మోడల్ కవర్ వచ్చిందంటే వెంటనే కొనేవారు కూడా ఉండడం విశేషం.

#### కవరే అందరికీ కనిపిస్తుంది



సెల్‌ఫోన్ ఎంతపెట్టి కొన్నా అది బయటకు కనిపించడం లేదు. అందుకే కలర్‌ఫుల్ సెల్‌ఫోన్ కవర్లను వాడుతున్నాను. ఒకసారి వాడిన మోడల్ మళ్లీ వాడకుండా కొత్త మోడల్ కోసం దుకాణానికి వస్తుంటాను. సంవత్సరానికి రెండు మూడు కవర్స్ మార్చుతాను.

– ఏలూరి రాణి

#### వినియోగదారుల్లో మహిళలే అధికం



మహిళలు సాధారణ సెల్‌ఫోన్ కవర్లంటే ఇష్టపడడం లేదు. మిక్కీ మౌస్‌తో పాటు వివిధ రకాలు డిజైనర్ కవర్స్ అంటే వారు బాగా ఇష్టపడుతున్నారు. కవర్లు కొద్దిగా మాసిపోయినా కొత్తది కొంటున్నారు. ఇటువంటి వారిలో మహిళలే అధికంగా ఉంటున్నారు. నిత్యం 30 నుంచి 40 మంది మహిళలు సెల్‌ఫోన్ కవర్లు కొనుగోలు చేస్తారు.

– ఆకుల రాజా, మొబైల్‌షాపు యజమాని

# ఆర్యవైశ్యులకు అండగా సీఎం జగన్

### రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కుప్పం ప్రసాద్

**కాకినాడ:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో పురోభివృద్ధి సాధించగలిగారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం అధ్యక్షుడు, వైశ్య అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యాపార రంగంలో స్థిరపడ్డవారిలో 80 శాతం మంది ఆర్యవైశ్యులేనన్నారు. టీడీపీ హయాంలో ఈ వర్గం నిర్లక్ష్యానికి గురైతే సీఎం జగన్ రాజకీయ ప్రాధాన్యంతో పాటు వ్యాపారుల ప్రగతికి, ఆయా కుటుంబాల అభ్యున్నతికి చేదోడుగా నిలిచారన్నారు. వ్యాపారులపై అధికారుల దాడులు, వేధింపులు దాదాపు నియంత్రించారన్నారు. నవరత్న పథకాల ద్వారా వేలాది మంది ఆర్యవైశ్యులు లబ్ధిపొందారన్నారు. సీఎం జగన్ మాత్రం పేదల సంక్షేమానికి రూ.2.5 లక్షల కోట్లు ఖర్చు చేశారన్నారు. వ్యాపారవర్గాలు, ఆర్యవైశ్యుల అభ్యున్నతికి ముఖ్యమంత్రి చేసిన కృషిని వివరిస్తూ పెద్ద ఎత్తున సమావేశాలు ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. కన్యకాపరమేశ్వరి ఆలయాల నిర్వహణను ఆర్యవైశ్యులకే అప్పగించడంతో పాటు పొట్టి శ్రీరాములు జయంతి, వర్ధంతులను అధికారికంగా నిర్వహించేలా సీఎం నిర్ణయం తీసుకున్నారన్నారు. సమావేశంలో వాణిజ్యవిభాగం జోనల్ ఇన్‌చార్జ్ పెద్దిరత్నాజీ, రాష్ట్ర కార్యదర్శి బాదం మధు, వైశ్య ప్రముఖులు నాళం అండాళ్ తదితరులు హాజరయ్యారు.

# పంచారామ క్షేత్రంలో భక్తుల కిటకిట

**సామర్లకోట:** స్థానిక పంచారామ క్షేత్రంలో మాఘ మాసం దానికి తోడు స్వామివారికి ప్రీతిపాత్రమైన సోమవారం కావడంతో బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామ భీమేశ్వరస్వామిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. తెల్లవారు జామున జరిగే తొలి అభిషేకం, పూజలను తిలకించారు. పిఠాపురం మహారాజా గోత్రనామాలతో తొలి పూజను నిర్వహించారు. ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, అల్లికి రాజగోపాల్‌శర్మ, శ్రీకాకుళపు సత్యనారాయణ, వినయ్, సన్నిధిరాజు వెంకన్న, చెరుకూరి రాంబాబు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు.